


మహాగౌరిగా భ్రమరాంబికాదేవి



గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న అధికారులు



కోలాట నృత్యం



శంఖం పూరిస్తూ..



శ్రీశైలం, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో దసరా ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. నవదుర్గ అలంకారాల్లో భాగంగా అమ్మవారి ఉత్సవమూర్తిని ఎనిమిదో రోజు మహాగౌరి స్వరూపంలో అలంకరించారు. నవదుర్గ మహాగౌరి రూపం అత్యంత శాంతమూర్తిగా చెప్పబడుతోంది. ఈదేవి తెల్లని వస్త్రాలను ధరించి, చతుర్భుజాలను కలిగి ఉంటుంది. కుడివైపు పైభుజంలో త్రిశూలాన్ని కింది భుజంలో అభయ హస్తాన్ని, ఎడమవైపు పైభుజంలో వరముద్రను, కింది భుజంలో ఢమ రుకాన్ని కలిగి ఉంటుంది. మహాగౌరి తన పార్వతిరూపంలో పరమశివుని భర్తగా పొందేందుకు కఠోర తపస్సు చేయసాగింది. ఈతపస్సు కారణంగా ఈమె శరీరమంతా నల్లబడింది. ఆ తపస్సుకు ప్రసన్నుడైన పరమశివుడు ఈమె శరీరంపై గంగాజలాన్ని చిలకరించాడు. అప్పుడు ఆదేవి తేజోవంతమైన గౌరవర్ణంతో అలరారింది. అందుకే ఈదేవి మహాగౌరిగా పిలువబడింది. ఈ దేవిని పూజించడంతో సకల పాపాలను నశిస్తాయని, కష్టాలు తొలగిపోతాయని చెప్పబడుతోంది.

నంది వాహనంపై కొలువుదీరిన ఉత్సవమూర్తులు

సాంస్కృతిక కార్యక్రమాలు

దసరా మహోత్సవాల సందర్భంగా ఆలయ దక్షిణమాడ వీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 8గంటల వరకు నటరాజ కళా కూచిపూడి డ్యాన్స్ అకాడమీ, గుంటూరు వారిచే సంప్రదాయ నృత్యం, రాత్రి 8గంటల నుంచి వి.లక్ష్మి సునీత వారి బృందంతో భక్తి సంగీత విభావరి భక్తులను ఆకట్టుకుంది.

గ్రామోత్సవం రద్దు

ఆది దంపతులను ప్రత్యేక అలంకరణలో నంది వాహనంపై కొలువుదీర్చి పూజలు చేశారు. ఆలయ ఉత్సవం నిర్వహించారు. అయితే వర్షం కారణంగా గ్రామోత్సవాన్ని రద్దు చేశారు. ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. కళారూపాలు, వేషధారణలు, డప్పు వాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నేడు సిద్ధిదాయిని అలంకరణ

తొమ్మిదో రోజు మంగళవారం అమ్మ వారు సిద్ధిదాయిని అలంకరణలో దర్శనమిస్తారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు కైలాస వాహనంపై విహరించనున్నారు.



భక్తుల రద్దీ

శ్రీశైల క్షేత్రంలో భక్తులతో క్యూలైన్లన్నీ కిటకిటలాడాయి. భక్తుల రద్దీ దృష్ట్యా శని, ఆది, సోమవారాలలో ఆర్జిత అభిషేకాలు, కుంకుమార్చనలు నిలుపుదల చేశారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర, దర్శనాల ద్వారా భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తింది. భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి తలనీలాలు సమర్పించారు. వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్లు ముందస్తుగా తీసుకున్న భక్తులకు రెండు విడతలుగా స్పర్శ దర్శనానికి అధికారులు అనుమ తిస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకున్నట్లు దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి

● కలెక్టర్ రాజకుమారి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆమె అధికారులతో మాట్లాడారు. అర్జీల పరిష్కారంలో నాణ్యత తప్పనిసరిగా పాటించాలన్నారు. జిల్లాలో గతేడాది జూన్ 15నుంచి ఇప్పటివరకు మొత్తం 43,143 అర్జీలు స్వీకరించబడ్డాయన్నారు. సరైన రీతిలో ఎండార్స్ చేయకపోవడంతో 471 దరఖాస్తులు రీ ఓపెన్ అయ్యాయన్నారు. ప్రతి అధికారి రీ-ఓపెనైనా అర్జీలపై దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ఫీడ్ బ్యాక్ సేకరణలో డోన్ రూరల్, గడివేముల, గోస్పాడు, జూపాడుబంగ్లా, మిడుతూరు, సంజామల, రుద్రవరం, పాములపాడు, వెలుగోడు మండలాలు రెండు వారాలుగా ఎలాంటి చర్యలు చేపట్టలేదని గుర్తించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో ఆర్అండ్‌బీ ఏఈ

కాంట్రాక్టర్ నుంచి రూ.15 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



ఏసీబీ అధికారుల అదుపులో ఆళ్లగడ్డ ఆర్అండ్‌బీ ఏఈ దూదేకుల దస్తగిరి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ రోడ్లు, భవనాల శాఖ ఏఈ దస్తగిరి సోమవారం ఏసీబీ వలకు చిక్కాడు. సత్యసాయి జిల్లాకు చెందిన ప్రైవేట్ కాంట్రాక్టర్ రమేశ్ పట్టణంలోని చింతకుంట రోడ్డులో ఓఎఫ్‌సీ కేబుల్ వేయడానికి నంద్యాల ఆర్అండ్‌బీ ఈఈ కార్యాలయంలో డబ్బులు చెల్లించి రోడ్ కటింగ్ పర్మిషన్ తీసుకున్నారు. ఈ పనులు ఆళ్లగడ్డ ఆర్అండ్‌బీ ఏఈ దూదేకుల దస్తగిరి సమక్షంలో చేయాల్సి ఉంది. ఇందుకోసం కాంట్రాక్టర్ ఏఈని సంప్రదించారు. ఈ పనులు చేసుకోవాలంటే తనకు రూ.70 వేలు లంచం ఇవ్వాలని ఏఈ డిమాండ్ చేశాడు. అంత డబ్బులు ఇచ్చుకోలేనని, రూ.55 వేలు ఇస్తానని కాంట్రాక్టర్ ఒప్పుకొన్నారు. ఈ మేరకు రూ.40 వేలు నాలుగు రోజుల క్రితం ఏఈకి ఇచ్చారు. మిగతా రూ.15 వేలు ఇవ్వాలని ఏఈ కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేశాడు. దీంతో కాంట్రాక్టర్ కర్నూలు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. కర్నూలు ఏసీబీ డీఎస్పీ సోమన్న నేతృత్వంలో అధికారుల బృందం రంగంలోకి దిగింది. ఆర్అండ్‌బీ కార్యాలయంలో కాంట్రాక్టర్ నుంచి ఏఈ రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్లు రాజా ప్రభాకర్, కృష్ణయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

‘కొలనుభారతి’కి పోటెత్తిన భక్తులు

210 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న పురోహితులు

కొత్తపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొలనుభారతి పుణ్యక్షేత్రంలో సోమవారం అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు చారుగోషిణి నదిజలాలతో అమ్మవారిని అభిషేకించారు. 210 మంది చిన్నారులకు అక్షర బీజాక్షర క్రతువులు నిర్వహించారు. రాష్ట్రంలోని ఏకైక సరస్వతి అమ్మవారి క్షేత్రమైనప్పటికీ ఒక దేవస్థానం అధికారి పర్యవేక్షణ లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. పురోహితులు తూతూ మంత్రంగా పూజలు చేసి మమ అనిపించేశారు. భక్తుల ఇబ్బందులను ఈవో రామలింగారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తాను విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో విధుల్లో ఉన్నట్లు తెలిపారు.

బీమా సఖితో భరోసా..!

జిల్లాలో గ్రామైక్య సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. బ్యాంకు లింకేజీ, ఇతర సంస్థలతో రుణాలందించి గ్రామైక్య సంఘాల్లోని మహిళలకు చేయూత అందించేందుకు ప్రభుత్వం దృష్టిసారించింది. ఇంటి వద్దనే ఖాళీగా ఉన్నవారికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం బీమా సఖి యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. జీవిత బీమా సంస్థతో (ఎల్ఐసీ) కూడా ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే జిల్లాలో 70 శాతం ఎంపిక ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు.



● గ్రామైక్య సంఘాల మహిళలకు ఉపాధి
● క్షేత్రస్థాయిలో ఎంపిక పక్రియ
● పర్యవేక్షణాధికారులుగా ఏపీఎం, డీపీఎంలు

నంద్యాల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): బీమా సఖి యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకంతో మహిళల్లో ఆర్థిక భరోసా కల్పిస్తోంది. ఎక్కడిక్కడ క్షేత్ర స్థాయిలో ఈ పథకం ప్రక్రియ పర్యవేక్షణ కోసం ఏపీఎం, డీపీఎంలను కూటమి ప్రభుత్వం సైతం ప్రత్యేక (నోడల్) అధికారులుగా నియమించారు. ఇప్పటికే ఎంపిక పక్రియ 70శాతం పక్రియ పూర్తైయినట్లు తెలిసింది. ఏదిఏమైనా బీమా యోజన పథకంతో పేద మహిళలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లైంది.

జిల్లాలో పరిస్థితి ఇలా...

●	జిల్లాలో డ్వాక్రా సంఘాలు	: 30,600
●	సంఘాల్లోని సభ్యులు	: 3.10 లక్షలు
●	బీమా సభ్యుల లక్ష్యం	: 330 మంది



మూడేళ్ల కాల పరిమితితో ఎంపిక

జిల్లాలో గ్రామైక్య(డ్వాక్రా) సంఘాల్లోని 330మంది సభ్యులను భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఐఆర్‌డీఏ) మార్గదర్శకాల ప్రకారం మూడేళ్ల కాల పరిమితితో ఎంపిక చేయనున్నారు. ఎంపికైన వారందరికి శిక్షణ ఇచ్చి మరీ సంబంధిత ధ్రువ పత్రాలను అందజేయనున్నారు. తొలి ఏడాది ప్రతినెల రూ.7వేలు, రెండో సంవత్సరం రూ.6వేలు, మూడో ఏటా రూ.5వేలు చొప్పున ప్రోత్సాహకం కింద ఎల్ఐసీ జమ చేయనుంది.

అర్హులు ఎవరంటే...

ఆయా సంఘాల్లో ఎవరైనా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అదేవిధంగా వారి వయస్సు 18 నుంచి 70 ఏళ్లలోపు ఉండాలి. జీత భత్యాలు పొందే ఉద్యోగులై ఉండరాదు. ఏదైనా వ్యాపారం, ఉపాధి ద్వారా ఆదాయం పొందే వారై ఉండరాదు. తప్పనిసరిగా సంస్థ పెట్టిన పరీక్షకు హాజరై ఉండాలి. ఎంపికైన వారికి శిక్షణ ఇస్తారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎల్ఐసీకి సంబంధించిన పాలసీలపై అవగాహన కల్పించడంతో చేర్పించేలా చొరవ తీసుకోవాలి

త్వరలో శిక్షణ..



డ్వాక్రా సంఘాల్లో అర్హులై ఉండి చురుకుగా ఉన్న వారిని బీమా సఖిగా ఎంపిక చేస్తాం. ఇప్పటికే 70శాతం ప్రక్రియ పూర్తైయింది. క్షేత్రస్థాయిలో ఏపీఎం, డీపీఎంలు పర్యవేక్షిస్తున్నారు.

● శ్రీధర్‌రెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ, నంద్యాల

శ్రీశైలం విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి ముమ్మరం

10 క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీశైలం,సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం కుడి, ఎడమ గల రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి ముమ్మరం చేశారు. జెన్-కో అధికారులు గడిచిన ఇరవై నాలుగు గంటల్లో 30.754 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. శ్రీశైలం రిజర్వాయర్ 10 రేడియల్ క్రస్ట్‌గేట్లను ఒక్కొక్కటి 23 అడుగుల ఎత్తుకు తెరచి స్పిల్ వే గుండా 5,22,040 క్యూసెక్కులు దిగువ సాగర్‌కు విడుదల చేశారు. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి డ్యాం నీటిమట్టం 883 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 205 టీఎంసీలుగా ఉంది. ఎగువ జూరాల గేట్లు, సుంకేసుల, హంద్రీల నుంచి 6,00,363 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. వరద ప్రవాహం భారీగా వచ్చి చేరుతుండటంతో జలాశయం ఇంజనీర్లు ఎప్పటికప్పుడు వరద ఉధృతిని సాగనంపుతున్నారు. శ్రీశైలం కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం 64,441 క్యూసెక్కులు విడుదల చేశారు.



శ్రీశైలం కుడిగట్టు విద్యుత్ కేంద్రం

ముంచేశారు..!



కర్నూలు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆదోని మున్సిపాలిటీకి 165ఏళ్ల చరిత్ర ఉంది. మండిగిరి, సాదాపురం, కల్లుబావి, పర్వతాపురం పట్టణానికి పరిసర గ్రామాలుగా ఉన్నాయి. పట్టణం పారిశ్రామిక, వాణిజ్యంగా ఎంతో అభివృద్ధి చెందింది. జనాభాతో పాటుగా కాలనీలు విస్తరించాయి. పర్వతాపురం, కల్లుబావి గ్రామాలు పురపాలక సంఘంలో విలీనం చేశారు. మండిగిరి, సాదాపురం గ్రామాలు పట్టణంలో అంతర్భాగం అయ్యాయి. ప్రస్తుతం జనాభా 3లక్షలు దాటిందని, 45వేలకు పైగా నివాసగృహాలు చేరాయని అధికారులు అంచనా. ఒకప్పుడు శివారులో ప్రవహించే రాంజల కడగమ్మ, శాంతమల్లప్ప, మేక, ఆవుదూడ వంకలు ప్రస్తుతం పట్టణంలో అంతర్భాగం అయ్యాయి. పరిసరాల్లో హౌసింగ్ బోర్డు, ఎన్జీవో, పోస్టల్ కాలనీ, తిరుమలనగర్, గాంధీనగర్, కపర్తినగర్ ఇలా విలాసవంతమైన కాలనీలు విస్తరించాయి. కాలనీలతో వంకలు, వాగులు ఆక్రమణలకు గురై కుచించుకుపోయి ఆనవాళ్లు కోల్పోయాయి.

● ఆదోనిలో రాంజల కడగమ్మ, ఆవుదూడ, మేక వంకలు
● ఎక్కడికక్కడే ఆక్రమణలు
● వంకలు కాస్త డ్రైనేజీలుగా మారిన వైనం
● జడివానలకు జలదిగ్బంధంలో పలు కాలనీలు
● చోద్యం చూస్తున్న యంత్రాంగం, పాలకులు



ఆదోని పట్టణం తిరుమల నగర్ వద్ద జలమయమైన ప్రధాన రహదారి

మిగతా 7వ పేజీలో

బాధితులకు న్యాయం చేయండి

● ఎస్పీ సునీల్ షెరాన్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

నంద్యాల టౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఎస్పీ సునీల్‌షెరాన్ ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అర్జీలను చట్టపరిధిలోని పరిష్కరించాలన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు పరిష్కారం కానప్పుడు మాత్రమే ఇక్కడికి రావాలని అర్జీదారులను సూచించారు. 76 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ఎక్కువగా మహానంది, అవుకు, గడివేముల, పాణ్యం, వంటి ప్రాంతాల నుంచి స్థానిక స్టేషన్లలో న్యాయం జరగలేదని వచ్చారు. ఉద్యోగమిప్పిస్తామని చెప్పి తమ వద్ద నుంచి రూ.1.5లక్షల డబ్బులు తన సోదరుడు తీసుకున్నాడని వెంకటేశ్వరాపురానికి చెందిన సాలమ్మ ఫిర్యాదు చేశారు. డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని, న్యాయం చేయాలని ఆమె ఎస్పీని కోరారు. అవుకు మండలం అన్నవరం గ్రామానికి చెందిన ఉసేన్‌బీ మహిళ నెలరోజుల క్రితం తమ ఇంట్లో చోరీ జరిగిందని, అవుకు ఎస్ఐ, సీఐకి ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.



చక్రవర్తులపల్లెలో సాగు చేసిన తైవాన్ జామ

జామకు పండు ఈగ బెడద

- భారీగా తగ్గిన దిగుబడి
- నాడు 400 ఎకరాలు.. నేడు 60 ఎకరాలు
- వైరస్‌తో దెబ్బతిన్న తోటలు
- ఆందోళనలో అన్నదాతలు

చాగలమర్రి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జామ తోటలను పండు ఈగ తినేస్తోంది. ఎన్ని మందులు పిచికారి చేసినా ఫలితం కనిపించడం లేదు. పండు ఈగలతో జామ దిగుబడి భారీగా తగ్గి నష్టపోయే పరిస్థితి నెలకొంది. దెబ్బతిన్న జామకాయలను పొలాల గట్ల వెంట పడేస్తున్నారు. ఇప్పటికే చేసిన అప్పులకు తోడు తెగుళ్ల నివారణకు మందులు పిచికారి చేయడానికి ఇంకెంత అప్పు చేయాలని రైతులు ఆవేదన చెందుతున్నారు.



పండుగ ఈగ నివారణ కోసం బుట్టలు కడుతున్న రైతు

జిల్లాలో నాడు 300 ఎకరాల్లో..

జిల్లాలో నాడు 300 ఎకరాల్లో జామ తోటలు సాగు చేయగా నేడు 60 ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నారు. చాగలమర్రి మండలంలోని ముత్యాలపాడు, చక్రవర్తులపల్లె, గొడిగనూరు, శెట్టివీడు గ్రామాల్లో 60ఎకరాల దాక తోటలను సాగు చేశారు. ఇప్పటి వరకు ఎకరాకు రూ.70 వేలు వరకు పెట్టుబడి పెట్టారు. జామ కాయలు కోత సమయానికి పండు ఈత సోకి పండు దెబ్బతిని కుళ్లిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

లక్షలాది రూపాయలు పెట్టుబడి..

జామ తోటలు సాగుకు లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఏడాదిపాటు కాపాడుకుంటూ వచ్చినా కోత సమాయానికి దిగుబడి భారీగా తగ్గింది. ఎకరాకు 800మొక్కలు నాటారు. ఎకరాకు 20 టన్నులు దిగుబడి రావాల్సి ఉండగా 3టన్నులు మాత్రమే వస్తున్నాయి. రైతులు జామతోటలనే తొలగిస్తున్నారు. పండు ఈగ నివారణకు ఎన్ని మందులు పిచికారిచేసిన ప్రయోజనం లేకపోవడంతో ఆయా గ్రామాల్లో జామతోటలను తొలగించి ప్రత్యామ్నాయ పంటలు సాగుచేస్తున్నారు.

ధర ఉన్నా దిగుబడి లేక..

జామకాయలు పండించినా దిగుబడి లేక నష్టపోవాల్సి వస్తోంది. ఏడాది పాటు జామచెట్లను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పంట కోత సమయంలో దిగుబడి తగ్గి నష్టపోతున్నారు. ఎకరాకు 20 టన్నులు దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 3 టన్నులు మాత్రమే వస్తున్నాయి. ధర ఉన్నా దిగుబడి లేక నష్టపోవాల్సి వస్తోందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్లాస్టిక్ కవర్లతో..

జామకాయను పండు ఈగ తినకుండా ప్లాస్టిక్ కవర్లు తొడిగారు. ఎకరాకు 200బాక్సుల కవర్లు కొనుగోలు చేసి జామకాయలను పురుగు తినకుండా కాపాడుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. పండు ఈగ నివారణ కోసం రైతులే తమ సొంత ఆలోచనలతో రూ.180 విలువ చేసే ప్లాస్టిక్ బుట్టలను కొనుగోలు చేసుకొని జామ చెట్ల వద్ద ఉంచుతున్నారు. దీంతో పండు ఈగ, వివిధ పక్షులు తినకుండా రక్షణ కవచంలా ఉంటున్నాయని రైతులు పేర్కొన్నారు. 4 ఎకరాల్లో జామ కాయలకు కవర్ల కోసం ఖర్చు రూ.1.20 లక్షలు ఖర్చుచేశారు. పండుఈగ నివారణ కోసం ఎకరాకు 10 నుంచి 20 బుట్టలు ఏర్పాటు చేయడంతో ఆ బుట్టలో పండుఈగలు బుట్టలో పడుతుండటంతో కాయలకు ఈగబెడద తగ్గిందన్నారు. ప్రస్తుతం టన్ను ధర రూ.30 వేలు పలుకుతున్న దిగుబడి లేక నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.



బాక్సులకు నింపిన జామ కాయలు

తెగుళ్లతో నష్టపోతున్నాం



తైవాన్ జామకు తెగుళ్ల సోకి దెబ్బతింటోంది. నాలుగెకరాల్లో జామ తోట సాగుచేశా. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టా. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. పండు ఈగ నివారణకు కవర్లు కొనుగోలు చేసి కాయలకు తొడిగి ఈగ నుంచి కాపాడుకుంటున్నా. రూ.1.20 లక్షల దాక కవర్ల కోసం ఖర్చు చేస్తున్నా. ● రవీంద్రారెడ్డి, రైతు, చక్రవర్తులపల్లె

ఉద్యాన పంటలకు రాయితీ ఇవ్వాలి



వైరస్ వల్ల జామతోటలు దెబ్బతింటున్నాయి. కోతకొచ్చే సమయంలో పండును ఈగ తినేస్తోంది. ఎన్ని మందులు వాడిన తెగుళ్ల ఉధృతి తగ్గలేదు. ప్రభుత్వం స్పందించి ఉద్యాన పంటల రాయితీ, పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు మంజూరు చేయాలి. -పుల్లయ్య, రైతు, ముత్యాలపాడు

స్త్రీ పథకంలో కార్మికులు నమోదు కావాలి

కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చిన్న పరిశ్రమల నుంచి పెద్ద పరిశ్రమల వరకు పనిచేస్తున్న కార్మికులంతా స్త్రీ, క్షమాభిక్ష పథకాల్లో తప్పనిసరిగా నమోదు కావాలని కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో జరిగిన సమావేశంలో ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) తిరుపతి డిప్యూటీ డైరెక్టర్ కృష్ణకుమార్ ఈఎస్ఐసీ సామాజిక భద్రతా పథకం ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేతనం రూ.21 వేల లోపు ఉన్న ఉద్యోగులందరూ ఈ పథకంలో నమోదు చేసుకోవచ్చన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులతో పాటు ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కూడా ఈ పథకంలో భాగం కావచ్చని తెలిపారు. ఉద్యోగి వేతనం నుంచి 0.75 శాతం, పరిశ్రమ యాజమాన్యం నుంచి 3.25 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగి అనారోగ్యం కారణంగా సెలవులో ఉన్నప్పటికీ వేతనం చెల్లింపుతో పాటు వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందన్నారు. మహిళా ఉద్యోగుల కోసం ప్రసూతి ప్రయోజనం కింద గరిష్ఠంగా 26 వారాల పాటు 100 శాతం సగటు రోజువారీ వేతనం చెల్లిస్తారన్నారు. తాత్కాలికంగా లేదా శాశ్వతంగా వైకల్యం ఏర్పడితే అశక్తత ప్రయోజనం రూపంలో నెలవారీ చెల్లింపు లభిస్తుందన్నారు. ఉద్యోగి మరణిస్తే అతని ఆధారితులకు నెలవారీ పింఛన్ అందిస్తారన్నారు. అలాగే పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు ఏడాదికి రూ.120 రుసుము చెల్లించి వైద్య సదుపాయం పొందవచ్చన్నారు. కుటుంబంలో అమ్మాయికి వివాహం అయ్యే వరకు, అబ్బాయికి 21 ఏళ్ల వరకు ఈ వైద్య సదుపాయాలు లభిస్తాయని కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 8 శాతం మంది మాత్రమే ఈ పథకంలో నమోదయ్యారని, పూర్తి స్థాయిలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

జీఎస్టీ యాప్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి: జేసీ

జీఎస్టీ యాప్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనంతరం ఆయన మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమైన శాఖల వారీ షెడ్యూల్‌ను అక్టోబరు 19 వరకు కొనసాగించాలన్నారు. అనంతరం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ద్వారా వినియోగదారులకు లభించే ప్రయోజనాలను వివరించే కరపత్రాలను, జిల్లా వాటర్ బులెటిన్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

చౌడేశ్వరి సేవలో దేవదాయశాఖ ఆర్జేసీ

బనగానపల్లె, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రముఖ శక్తిక్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత ఆలయాన్ని దేవదాయ శాఖ ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. నందవరం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అర్చకులు, వేద పండితులు తీర్థప్రసాదాలు అందించారు.



చంద్రశేఖర్ ఆజాద్ కుటుంబ సభ్యులను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

'నవ్యాంధ్ర'లో పెట్టుబడులు పెట్టండి

దక్షిణ కొరియా పారిశ్రామికవేత్తలతో మంత్రి బీసీ



దక్షిణ కొరియాలో పారిశ్రామికవేత్తలతో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, మంత్రి నారాయణ

బనగానపల్లె, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రలో పెట్టుబడులు పెట్టాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, పురపాలక శాఖ మంత్రి నారాయణ కోరారు. దక్షిణ కొరియాలోని సియోల్‌లో రెండోరోజైన సోమవారం పలువురు పెట్టుబడిదారులు, వివిధ కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. ప్రపంచంలోని అతిపెద్ద చిప్‌లు, ఫ్లాష్ మెమోరీ చిప్‌లు సరఫరాదారులైన ఎస్‌కే హైనిక్ సెమీకండక్టర్ ప్రతినిధులతో మంత్రి మాట్లాడారు. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని కోరారు. ఏపీలో మెమోరీ మాడ్యూల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు పెట్టుబడులు పెట్టే సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. అలాగే ఏపీ ఈడీపీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్- సౌత్‌కొరియా బిజినెస్ ఫోరం పార్టనర్‌షిప్ సమ్మిట్ షో కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి బీసీ మాట్లాడుతూ ఏపీలో 156 ప్రాజెక్టుల ద్వారా రూ.10లక్షలకు పైగా పెట్టుబడులు సాధించడంతో పాటు 8లక్షల ఉద్యోగాలు సృష్టించినట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులకు ఒక గమ్యస్థానం ఆంధ్రప్రదేశ్ అని వివరించారు. ఏపీలో పోర్టులు ఇప్పటికే తూర్పుతీరంలో 30శాతం కార్గో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న 4 కొత్త గ్రీన్‌ఫీల్డు పోర్టులు రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ ఏడాదికి అదనంగా 353 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో సామర్థ్యాన్ని జోడించగలవన్నారు. క్వాంటం సిస్టంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే రాజధాని అమరావతిలో 44వేల ఎకరాల్లో స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

గుంతకల్లు, నంద్యాల మధ్య అదనపు ఓహెచ్ లైన్ ఏర్పాటు

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఆధునికీకరణలో భాగంగా గుంతకల్లు - నంద్యాల మధ్య అదనపు ఓహెచ్ లైన్ ఏర్పాటుకు త్వరితగతిన పనులు ప్రారంభిస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. ఎక్కువ రైళ్లు నడపడం కోసం పలు సెక్షన్లలో 25కేవీ లైన్ నుంచి మరో 25కేవీ లైన్‌ను ఏర్పాటు చేయాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు గుంతకల్లు - నంద్యాల సెక్షన్‌లో ఈ అదనపు లైన్ సదుపాయం కల్పించనున్నారు. ప్రస్తుతం రెండు సబ్ స్టేషన్ల మధ్య రెండు గూడ్స్ రైళ్లను మాత్రమే అనుమతిస్తారు. అయితే అదనపు లైన్ ఏర్పాటు చేయడంతో ఎక్కువ రైళ్లు నడపడానికి అవకాశం ఉంది.



నందవరంలో మహాగౌరీమాత అలంకారంలో చౌడేశ్వరీమాత



మహానందిలో మహాగౌరి దుర్గ అలంకరణలో కామేశ్వరీదేవి



కె.నాగలాపురంలో సరస్వతి దేవి అలంకరణలో సుంకులాపరమేశ్వరి అమ్మవారు



కర్నూలు చిన్న అమ్మవారిశాలలో సరస్వతి దేవి అలంకరణ



మంత్రాలయంలో సరస్వతీదేవి అలంకరణలో మంచాలమ్మ అమ్మవారు

వివిధ రూపాల్లో అమ్మవారు

కర్నూలు కల్చరల్/ మంత్రాలయం/ గూడూరు/బనగానపల్లె/ సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జగన్మాత, ఆది పరాశక్తి అయిన దుర్గాదేవిని నిత్యం స్మరిస్తూ ఉమ్మడి జిల్లావాసులు శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా కొనసాగిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో పుణ్యక్షేత్రాలు, ప్రసిద్ధ ఆలయాలతోపాటూ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాలు (అమ్మవారిశాలలు), శైవ క్షేత్రాలు, ధార్మిక కేంద్రాల్లో అమ్మవారికి శోడశోపేత పూజలతో, నిత్య నైవేద్యాలతో, అర్చనాది హారతులతో కొలిచి తరిస్తున్నారు. జగజ్జననికి సాయంత్రం ప్రత్యేక అలంకరణలు చేసి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. దేవీ నవరాత్రుల్లో 8వ రోజును అమ్మవారు మహాసరస్వతి దేవిగా భక్తులను కటాక్షిస్తారు. సోమవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆయా ఆలయాల్లో మూలా నక్షత్ర పూజలు, చిన్నారులతో సరస్వతి దేవి పూజలు చేపట్టారు. దేవీ నవరాత్రుల్లో దుర్గాదేవి మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి అనే త్రిశక్తి స్వరూపిణిగా కొలువై ఉంటుంది. ఈ నేపథ్యంలో మూలా నక్షత్రం రోజున మహా సరస్వతిగా అమ్మవారు దర్శనం ఇస్తారు.

- మంత్రాలయంలో మంచాలమ్మ అమ్మవారు సరస్వతీదేవిగా మయూర వాహనంపై దర్శనం ఇచ్చారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. గూడూరు మండలంలోని మండలంలోని కె.నాగలాపురంలో సుంకులా పరమేశ్వరి అమ్మవారు ఎనిమిదో రోజు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో రాధాకృష్ణ, గోపాల్ రెడ్డి, సురేష్, సిబ్బంది కేశవ పాల్గొన్నారు. బనగానపల్లె మండలంలోని నందవరంలోని చౌడేశ్వరీమాత మహాగౌరీమాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాల్లో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




గీతా మందిరంలో సరస్వతి దేవి అలంకరణ

మహానందిలో మహాగౌరిగా కామేశ్వరీదేవి

మహానంది, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాల మంటపంలో వేదపండితులు, రుత్వికులు దాతల చేత చండీయాగం, హోమాలను నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి కామేశ్వరీదేవిని మహాగౌరి దుర్గగా అలంకరించి భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను వేదమంత్రాలతో నిర్వహించారు. ఉత్సవం ముందు చిన్నారులు నిర్వహించిన కూచిపూడి నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. క్షేత్రంలో కురుస్తున్న భారీ వర్షం కారణంగా సోమవారం రాత్రి ఆలయ మాడవీధులగుండా నిర్వహించే శేషవాహన గ్రామోత్సవాన్ని రద్దు చేసినట్లు ఆలయ ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి తెలిపారు.

రంగుల హరివిల్లు



శ్రీశైలం జలాశయం గేట్ల గుండా గంగమ్మ సాగిపోతుండగా ఈ సుందర దృశ్యాన్ని చూసి పర్యాటకులు సందడి చేశారు. సోమవారం ఎగిసిపడుతున్న గంగమ్మపై రంగురంగుల హరివిల్లు మెరిసింది. ఎంతో అద్భుతంగా వెలిసిన ఈ ముగ్ధ మనోహర దృశ్యాన్ని చూసి తన్మయంతో మైమరిచిపోయారు. ● శ్రీశైలం, ఆంధ్రజ్యోతి

విచారణ జరిపి న్యాయం చేస్తాం

- పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 79 ఫిర్యాదులు
- ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులన్నింటిపై విచారణ జరిపి సమస్యలు పరిష్కరిస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 79 ఫిర్యాదులొచ్చాయి. ఏఎస్పీ హుశేన్ పీరా, సీఐలు పాల్గొన్నారు.

- ఎయిడెడ్ స్కూల్‌లో టీచర్, క్లర్క్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మాధవప్ప అనే వ్యక్తి రూ.14.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఎల్.వెంకయ్యనగర్‌కు చెందిన కే.దొరస్వామి ఫిర్యాదు చేశారు.
- తన సంతకాలతో రూ.20లక్షలకు నకిలీ ప్రాంసరీ నోట్లు సృష్టించి కుట్రపూరితంగా మోసం చేస్తున్న నన్నూరులో పని చేస్తున్న ఆదినారాయణ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని హైదరాబాదుకు చెందిన జి.రామేశ్వరరెడ్డి ఫిర్యాదు చేశారు.
- మా అమ్మ నాగమణి వారం రోజుల నుంచి కనపడటం లేదని ఆచూకీ తెలిపాలని, బుధవారపేటకు చెందిన ఒక ఆటో డ్రైవర్‌పై అనుమానం ఉందని ఆమె కుమారుడు, కుమార్తె ఫిర్యాదు చేశారు.
- చేతికొచ్చిన కంది, సజ్జ పంటలను కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా తమ పంటను కోసుకుని వెళ్లారని, నష్ట పరిహారం ఇప్పించాలని గోనెగండ్ల మండలం, పెద్దనాటూరుకి చెందిన దస్తగిరి విన్నవించారు.
- తమకు ముగ్గురు కుమారులని, రెండో కుమారుడు టి.కుమార్ ఆస్తి గురించి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని న్యాయం చేయాలని కర్నూలు రాఘవేంద్ర నగర్‌కు చెందిన సుభద్రమ్మ వేడుకున్నారు.

మాస్ మీడియా ఆఫీసర్‌గా ప్రకాశ్ రాజు



కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ రెగ్యులర్ జిల్లా మాస్ ఎడ్యుకేషన్ మీడియా ఆఫీసర్ (డెమో)గా ఎన్.ప్రకాశ్ రాజు పదోన్నతి పొందారు. 2024-25 ప్యానల్ సంవత్సరానికి మెడికల్ అండ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగంలో హెచ్‌ఈఈవోలుగా ఉన్న అధికారులకు డెమోలుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. గుంటూరు పీవోడీటీటీలో హెచ్‌ఈఈవోగా పని చేస్తున్న ప్రకాశ్ రాజును కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసు డెమోగా పదోన్నతిపై నియమించింది. ఆనది ఆలూరు మండలం మొలగవెల్లి గ్రామం. గతంలో 2017 నుంచి 2019 వరకు గత రెండు సంవత్సరాలుగా ఇన్‌చార్జి డెమోగా పని చేస్తున్న శ్రీనివాసులుశెట్టిని ప్రాంతీయ శిక్షణ కేంద్రం (మగ) కమ్యూనికేషన్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఇచ్చారు. నంద్యాల జీజీహెచ్‌లో సీనియర్ ఫార్మసీ ఆఫీసర్‌గా పని చేస్తున్న వై.ప్రసాద్‌రావును కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసర్ చీఫ్ ఫార్మసీ ఆఫీసర్‌గా కడప ఆర్‌డీ పదోన్నతి కల్పించి పోస్టింగ్ ఆర్డర్స్ జారీ చేశారు.


హరికిషన్‌కు సాహితీ పురస్కారం



కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాలల సాహిత్యవేత్త, కథా రచయిత డాక్టర్ ఎం. హరికిషన్ సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. ఒంగోలుకు చెందిన సాహితీ సంస్థ 'కళామిత్ర మండలి- తెలుగు లోగిలి' అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ రావు సోమవారం తెలిపారు. 19వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో తెలుగు సాహిత్యంలో సేవలు అందిస్తున్న వారిని సత్కరిస్తామన్నారు. నవంబరు 2న ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో అందజేయనున్నా మన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

బనగానపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నంద్యాల బస్టాండ్ సమీపంలో సోమవారం 40 సంవత్సరాలకు పైగా ఉన్న గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. లైట్‌బ్లూ కలర్ షర్టు, సిమెంట్ కలర్ ప్యాంటు వేసుకున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు. సంబంధించిన వ్యక్తులు పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సీఐ కోరారు.



ఫారెస్టు అధికారుల దాడి

రుద్రవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం రేంజ్ పరిధిలోని పందిళ్లపల్లె గ్రామంలో వాసాల కలప ఉన్నట్లు సమాచారం అందడంతో రేంజర్ ముర్తుజావలి సిబ్బందితో కలిసి దాడి చేశారు. సోమవారం 30 వాసాల కలప దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటిని రుద్రవరం కలప డిపోకు తరలించారు. దాడుల్లో సెక్షన్ ఆఫీసరు మహబూబ్‌ఖాన్, బీట్ ఆఫీసరు సురేంద్రగౌడ్ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యుడు ఆనందతీర్థ శర్మ కన్నుమూత

- పలువురు ప్రముఖుల సంతాపం



ఆత్మకూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి ప్రాంతానికి చెందిన ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యులు, ఆయుర్వేద వైద్యుడు ఆనందతీర్థ శర్మ(75) ఆదివారం రాత్రి కన్నుమూశారు. కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన బెంగళూరు లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. సోమవారం బెంగళూరులోనే ఆయన అంత్యక్రియలు ముగిశాయి. ఈయన భార్య భారతి దేవి కూడా ఆరునెలల క్రితం గుండెపోటుతో మృతిచెందారు. ఆనందతీర్థ శర్మ మృతిపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

బాల్యం నుంచే హిందూ ధర్మరక్షణకు..

బాల్యం నుంచే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో చురుగ్గా పాల్గొంటూ హిందూ ధర్మరక్షణకై తనవంతు కృషిచేశారు. బహుభాషా కోవిదుడిగా కీర్తిగడించిన ఆయన హిందూ భూమి నృత్యాష్టం పేరిట ఎనిమిది శ్లోకాలను రచించి భారతదేశ వర్ణనను చక్కగా విషదీకరించారు. మాజీ రాష్ట్రపతి శంకర్‌దయాళ్‌శర్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, ఆంధ్రప్రదేశ్ మాజీ గవర్నర్ వీవీ గిరిలతో ప్రశంసలు అందుకున్నారు. ఆయుర్వే దంలో వైద్య విద్యాన్‌కోర్సు పూర్తిచేసిన ఆయన ఆయుర్వేదంలో వైద్యరత్నగా గుర్తింపు దక్కించుకున్నారు.

శివాజీ మహరాజ్ రాజవైద్యుడిగా..

పండిత ఆనందతీర్థ శర్మ పూర్వీకులు మరాఠ యోధుడు శివాజీ మహరాజ్ రాజ వైద్యులుగా పని చేసేవారు. కాలక్రమంలో ఆత్మకూరుకు వచ్చి ఇక్కడే స్థిరపడ్డారు. ఐదు తరాలకు పైగా ఇక్కడ ఆయుర్వేద వైద్యసేవలందిస్తూ సుపరిచితులయ్యారు. నేటికి వారి కుటుంబీకులు ఆయుర్వేద వైద్యాన్ని అందిస్తున్నారు. వీరి ముత్తాత అప్పారావు పేరిట ఆత్మకూరులో అప్పారావువీధి కూడా ఏర్పాటు కావడం గమనార్హం.

బన్నీ ఉత్సవాల్లో మద్యం నియంత్రణకు చర్యలు




ఎక్సైజ్ కానిస్టేబుళ్లతో అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి

ఆలూరు రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన దేవరగట్టు బన్నీ ఉత్సవాల నేపథ్యంలో నాటుసారా, కర్ణాటక మద్యం నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు రామకృష్ణారెడ్డి, రాజశేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ లలితాదేవి ఆధ్వర్యంలో బన్నీ ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు కానిస్టేబుళ్లకు పలు సూచనలు చేశారు. మాళమల్లేశ్వరస్వామి బన్నీ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతాయని, భక్తులు ఎవరూ మద్యం సేవించి ఉత్సవాల్లో పాల్గొనకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ఎక్సైజ్ ఎస్‌ఐలు నవీన్‌కుమార్, సిబ్బంది విజయ్, సోము పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి వెండి కలశం బహూకరణ

రుద్రవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాసాపురం వేంకటేశ్వర స్వామికి నంద్యాలకు చెందిన ఆచార్య దీక్షిత్ కమిటీ కార్యదర్శి నరసింహులుకు అరకేజీ కుంభహారతి వెండి కలశాన్ని బహూకరించారు. సోమవారం ఆలయానికి వచ్చిన దాతకు అర్చకులు గోపివర్మ, శివవర్మ ఘన స్వాగతం పలికారు. వేంకటేశ్వరస్వామి, లక్ష్మి గోదాదేవి అమ్మవారు, మానస లింగేశ్వరస్వామి, త్రిపుర సుందరీదేవి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజలనంతరం వారిని ఆలయ నిర్వాహకులు సన్మానించారు.



కలశాన్ని అందిస్తున్న దాతలు

ముంచేశారు..!



రాంజల ఉప్పొంగడంతో చెరువును తలపిస్తున్న హౌసింగ్ బోర్డు కాలనీ ప్రధాన రోడ్డు

(5వ పేజీ తరువాయి)

ఆక్రమణలు, కబ్జాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాల్సిన కర్తవ్యం అధికారులు, పాలకులపై ఉంది. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల బాధ్యత రాహిత్యం, ప్రజల్లో కొరవడిన జవాబుదారీతనం, స్వార్థం వెరసి ఆక్రమణలు ఇష్టారాజ్యమై వాగులు, వంకలు సహజ స్వరూపాన్ని కోల్పోయాయి. వర్షాకాలం వచ్చిందంటే పరిసర కాలనీల ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించాల్సిన దైన్యపరిస్థితి ఉంది. గత వైసీపీ పాలనలో విచ్చలవిడిగా సాగిన ఆక్రమణలు పుర ప్రజలకు శాపాలై వెంటాడుతున్నాయి. ఎడతెరిపి లేని వర్షాలకు జలదిగ్బంధంలో ఆయా కాలనీలు చిక్కుకున్నాయి. వంకలు, వాగులు ఆక్రమణలకు గురికాకుండా సంరక్షించాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ పలుమార్లు హెచ్చరికలు జారీచేసినా పాలకులు, అధికారుల్లో చలనం లేదు. ఇప్పటికైనా మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, నాయకులు ఆక్రమణలు తొలగించి సహజ వనరులను కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

సర్వే చేయిస్తాం



పట్టణంలో ప్రవహించే వంకలు, వాగులు ఆక్రమణకు గురి కావడంతో కాలనీలు జలదిగ్బంధం అయ్యాయని ఫిర్యాదులొచ్చాయి. ఆక్రమణలపై సర్వే చేయిస్తున్నాం. రాంజల కడగమ్ము వంక, ఆవు దూడ, శాంతమల్లప్ప, మేక వంకలు సహజ స్వరూపం ఎంత..? ఏఏ ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైందో తేల్చేందుకు సర్వేయర్‌ను నియమించమని తహసీల్దార్‌కు లేఖ రాశా. సర్వే చేసి ఉన్నతాధికా రులకు నివేదిక పంపి వారి ఆదే శాల మేరకు చర్యలు తీసుకుంటాం.

కృష్ణ, మున్సిపల్ కమిషనర్, ఆదోని

వాస్తవాలు ఇవీ..

- రాంజల చెరువు నిండితే కడగమ్ము పొంగిపొర్లిన వరద హౌసింగ్ బోర్డు, ఎన్జీవో కాలనీ మీదుగా కౌడల్ పేటలో ఆవు దూడవంకలో కలుస్తుంది. రాంజల సమీపంలో కడగమ్ము వం కను ఓ ప్రముఖ కాలేజీ యాజమాన్యం తమ కాలేజీలో కలి పేసుకొని డ్రైనేజీగా మార్చేసి పైన బండలు వేశారు. వంకలపై ప్రహరి కట్టి వర్షపు నీరు వెళ్లడానికి రంధ్రాలు పెట్టారు. హౌసింగ్ బోర్డు, ఎన్జీవో కాలనీలో వంక ఆక్రమణల కారణంగా ఆనవాళ్లు కోల్పోయింది. ఎడతెరిపిలేని వర్షాలతో రాంజల చెరువు ఉప్పొంగి ఆయా కాలనీలను ముంచెత్తడానికి ప్రధాన కారణం ఆక్రమణలే అని స్థానికులు ఏకరువు పెడుతున్నారు.
- ఆవుదూడ వంక అంబేద్కర్‌నగర్, కౌడల్‌పేట, బార్‌పేట, కుమ్మరిగేరి, బోయగేరి, టీజీఎల్ కాలనీ, రాయనగర్ మీదుగా ప్రవహిస్తుంది. ఆక్రమణలకు గురై సహజ స్వరూపాన్ని కోల్పోవడంతో కౌడల్‌పేట, బోయగేరి, రాయానగర్ కాలనీలో జలదిగ్బంధమై పేదలు తీవ్ర నష్టాన్ని మూటగట్టుకున్నారు.
- శాంత మల్లప్పకొండ ప్రాంతంలో కురిసే వర్షపు నీరు దిగువన చెరువులో చేరి, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ఏరియా, తిరుమల నగర్ మీదుగా మండిగిరి పంచాయతీ రాజీవ్‌గాంధీ నగర్ దగ్గర్లో మేక వంకలో కలుస్తుంది. తిరుమలనగర్‌లో ఈ వంక ఆక్రమణలకు గురై ఆనవాళ్లు కోల్పోయింది. చిన్నమా రెమ్మవ్వ దేవాలయం వద్ద ప్రధాన రహదారి కల్వర్టు వద్ద వంక సహజ ప్రవాహ స్వరూపాన్నే మార్చేశారు. వంకను పూడ్చేసి ఎల్ ఆకారంలో చిన్నపాటి డ్రైనేజీగా మార్చేశారు. తాజా వర్షాలకు వర్షపు నీరు వెళ్లేందుకు మార్గం లేక తిరుమల నగర్, ప్రధాన రహదారులు జలదిగ్బంధం అయ్యాయి.
- నెట్టేకల్లు ప్రాంతంలో ప్రారంభమయ్యే మేక వంక అక్షరశ్రీ రెడిసిడెన్సియల్ స్కూల్, సులోచనమ్మ గార్డెన్, పద్మ శాలినగర్, ఆర్టీసీ బస్టాండ్ జైహింద్ ఏరియా, కపర్తినగర్, మహాత్మాగాంధీనగర్, డీఎస్పీ బంగ్లా ఏరియా, క్రాంతినగర్ మీదుగా ప్రవహిస్తుంది. గతంలో ఈమేక వంకకు వరదొచ్చి పలువురు మృత్యువాత పడిన సంఘటనలున్నాయి. ఈ వంక కూడా ఎక్కడికక్కడే ఆక్రమణలకు గురై సహజ స్వరూపాన్ని కోల్పోతుంది.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ సిరి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ పన్నుల తగ్గింపుపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీఎస్టీ పన్నుల తగ్గింపు వల్ల కలిగే లబ్ధి గురించి ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలన్నారు. జీఎస్టీ పన్నుల తగ్గింపు వల్ల కుటుంబానికి నెలకు దాదాపు రూ.1000 వరకు ప్రయోజనం కలుగుతుందన్నారు. డీఆర్‌డీఏ, మెప్మా, వ్యవసాయ, విద్య తదితర శాఖల ఆధ్వర్యంలో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ర్యాలీలు, ప్రదర్శనలు, వ్యాసరచనలు, వక్తృత్వపు పోటీలు నిర్వహించి ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ నీరజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్

అన్న క్యాంటీన్, పారిశుధ్య నిర్వహణ అంశాలపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి సమాచారం తీసుకుంటున్న ఫీడ్ బ్యాక్‌లో సానుకూల స్పందన వచ్చే విధంగా కృషి చేయాలని కలెక్టర్ డా.ఏ.సిరి మున్సిపల్ కమిషనర్, డీపీవోలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి పీజీఆర్ఎస్, ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్, జీఎస్టీ పన్నుల తగ్గింపుపై విస్తృత అవగాహన కల్పించే అంశాలపై మండల స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐవీఆర్ఎస్‌కు సంబంధించి కొన్ని అన్న క్యాంటీన్‌లలో శానిటేషన్ పనులు సరిగ్గా జరగడం లేదని, భోజనం నాణ్యతగా లేదని, సమయానికి అన్న క్యాంటీన్లు తెరవడం లేదనే నెగిటివ్ ఫీడ్ బ్యాక్ వచ్చిందన్నారు. పీజీఆర్ఎస్‌కు సంబంధించి ఎట్‌టూ వ్యూలో ఒక అర్జీ కూడా ఉండకూడదని, వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని అధికారులను ఆదేశించారు.

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



అవయవదాన అంగీకారపత్రాన్ని ఎమ్మెల్యేకు ఇస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో స్త్రీ శక్తిని బలోపేతానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక దృష్టి సారించారని, మహిళల ఆరోగ్యానికి పెద్ద పీట వేశారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. స్వాస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం మహిళలను ఆరోగ్యవంతులుగా చేసేందుకు స్వాస్త్ నారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో శిబిరాలను ఏర్పాటు చేశారన్నారు. ముఖ్యంగా మహిళలు దీర్ఘకాలిక వ్యాధులను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. స్వాస్త్ నారీ కార్యక్రమంలో భాగంగా రక్తదానం, అవయవదానంపై అవగాహన పెరగాలన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన ఒక్కరూ అవయవదానం చేస్తే 8 మందికి ప్రాణదానం చేయవచ్చని అన్నారు. అనంతరం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు వినతి మేరకు ఎమ్మెల్యే అవయవదానం అంగీకారానికి ముందుకు వచ్చారు. అనంతరం జీవన్‌ధాన్ వెబ్‌సైట్‌లో పాణ్యం ఎమ్మెల్యే పేరు నమోదు చేసి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ, కర్నూలు జీజీహెచ్ స్వాస్త్ నారీ నోడల్ ఆఫీసర్ డా.మాధవీ శ్యామల, ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు, డీఐవో డా.ఉమ, డీఎస్‌వో డా.నాగప్రసాద్ పాల్గొన్నారు.

మొరాయించిన ఈనామ్ సర్వర్

- మధ్యాహ్నం 12 గంటల వరకు నిలిచిన టెండర్లు
- ఆలస్యంగా తూకాలు



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులో సోమవారం ఈ నామ్ సర్వర్ మొరాయించింది. దసరా పండుగ కావడం, ఖరీఫ్ పంట దిగుబడులు చేతికందడంతో రైతులు పత్తి దిగుబడులను భారీగా తీసుకొచ్చారు. ఉదయం రైతులు తమ కమిషన్ ఏజెంట్ దుకాణం ముందు విక్రయానికి తెచ్చిన పత్తి, వేరుశనగ, ఆముదం దిగుబడులు టెండర్‌కు ఉంచారు వ్యాపారులు బిడ్డింగ్ దాఖలు చేసే సమయంలో సర్వర్ మొరాయించడంతో మధ్యాహ్నం 12 గంటల వరకు సర్వర్ కోసం వేచి చూశారు. అధిక దిగుబడులు విక్రయానికి రావడం మరోవైపు మేఘాలు కమ్ముకొని ఉండడంతో రైతులు ఆందోళన చెందారు. మార్కెట్ యార్డ్ అధికారులు విజయవాడ ఈనామ్ సాఫ్ట్‌వేర్ సిబ్బందితో చర్చించినా ఫలితం లేకపోవడంతో వెంటనే మ్యానువల్‌గా టెండర్ దాఖలు చేయాలని మైక్ ద్వారా అనౌన్స్ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం 6:30గంటల వరకు కొనసాగింది. టెండర్ ఆలస్యంతో రాత్రి తూకాలు కొనసాగాయి. రైతులకు ఇబ్బంది కలగకుండా మాన్యువల్ టెండర్‌తో తూకాలు జరిపామని మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవింద్ తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయండి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి అక్టోబరు 7న విజయవాడ ధర్నా చౌక్‌లో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో పరిశీలకుడు కాకి ప్రకాష్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం ఎస్టీయూ భవన్‌లో ఫ్యాప్టో చైర్మన్ సేవాలాల్ నాయక్ అధ్యక్షతన పోస్టర్‌ను విడుదల చేశారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పీఆర్‌సీ మధ్యంతర భృతి మంజూరు, సీపీఎస్ స్థానంలో పాత పెన్షన్ విధానం ఆర్థిక బకాయిల చెల్లింపు అమలు చేస్తామని చెప్పిన కూటమి ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రూ.30వేల కోట్ల బకాయిల చెల్లించాలని కోరినా ఇంతవరకు స్పందించలేదన్నారు. రవికుమార్, ఎస్.గోకారి, ఇస్మాయిల్, మధుసూదన్‌రెడ్డి, రోషన్న, హుశేన్, శేఖర్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



హుశేనాపురంలో పత్తి పంటను పరిశీలిస్తున్న కాటసాని

ఓర్వకల్లు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కోరారు. సోమవారం మండలంలోని హుశేనాపురం గ్రామ సమీపంలో దెబ్బతిన్న పత్తి పొలాలు, వాగులను ఆయన పరిశీలించారు. ఎద్దుల బండ్లపై వెళ్లి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల రైతులు సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, టమోటా తదితర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పూర్తిస్థాయి సబ్సిడీతో శనగ విత్తనాలు పంపిణీ చేయాలన్నారు. ఎంపీపీ తిప్పన్న, నాయకులు వెంగన్న, నాగ తిరుపాలు,పాల మధుమోహన్, హరినాథరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కుటుంబాలతో ఆనందంగా గడపండి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్
- పదవీ విరమణ పొందిన డీఎస్పీ, ఏఎస్ఐ



పదవీ విరమణ పొందిన డీఎస్పీ, ఏఎస్ఐని సన్మానిస్తున్న ఎస్పీ

కర్నూలు క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ కుటుంబాలతో ఆనందంగా గడపాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ఆర్మూడు రిజర్వుడు డీఎస్పీ కే.భాస్కర్‌రావును, వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ శివరామిరెడ్డిని ఎస్పీ శాలువా కప్పి పూలమాలలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలం పోలీసు శాఖలో పనిచేసిన పదవీ విరమణ పొందడం అభినందనీయ మన్నారు. ఏమైనా సమస్యలుంటే తనను నేరుగా సంప్రదించా లన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుశేన్‌పీరా, కర్నూలు డీఎస్పీ జే.బాబు ప్రసాద్, సీఐలు తేజమూర్తి, కేశవరెడ్డి, శివశంకర్, గుణశేఖర్‌బాబు, వేణుగోపాల్, ఆర్ఐలు జావేద్, నారాయణ, ఆర్ఎస్ఐలు జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దసరాలోపు బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న కృష్ణార్జునరెడ్డి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం, పీఎఫ్, ఏపీజీఎల్ఐ సంబంధిత సెలవుల బకాయిలను దసరాలోపు చెల్లించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సహకోశాధికారి ఎ.కృష్ణార్జునరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణం టెక్కెలోని జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన పీఆర్సీని ప్రకటించి, 30శాతం మ ధ్యంత భృతిని అమలు చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర మీడి యా ఇన్‌చార్జి మల్లికార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటే శ్వర్లు, బాలయ్య, శ్రీపతి పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కాటికాపరి వృత్తిని ప్రభుత్వ వృత్తిగా గుర్తించి, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కేవీపీఎస్ (కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం) జిల్లా కార్యదర్శి రంగమ్మ, కేవీపీఎస్ జిల్లా నాయకుడు నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు డేవిడ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కాటికాపరులందరినీ నాలుగో తరగతి ఉద్యోగులుగా నియమించాలన్నారు. వృత్తి పరికరాలు, ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు జయరాణి, కుళాయి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

బండిఆత్మకూరు సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ లింగాపురం బీటీ రోడ్డు పనులను పంచాయ తీరాజ్ ఈఈ ఆయాజ్ సోమవారం ప్రారంభించారు. త్వరలో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. వెంట ఏఈ వెంకటరాముడు, కంచర్ల చిన్నలింగారెడ్డి, బీ మల్లేశ్వరరెడ్డి ఉన్నారు.

అధికారులు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ యశస్విని

మహానంది, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు సమయపాలన పా టించాలని ఎంపీపీ యశస్విని అన్నారు. సోమవారం మహానంది మండల సర్వ సభ్య సమావేశం తిమ్మాపురంలోని మండల కార్యాలయంలో ఎంపీడీవో మహమ్మద్ దౌలా ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో పరిసరా ల శుభ్రతపై అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యం గా తాగునీరు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. మసీదుపురం గ్రామంలోని ఎస్సీకాల నీలో వర్షపు నీరు నిల్వడంతో ప్రజలు ఇబ్బందులు పడ్తున్నారని సర్పంచ్ లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ మల్లికార్జునరెడ్డి సభ దృష్టికి తెచ్చారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు కేవీఆర్ మహేశ్వరరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

● మాండ్ర శివానందరెడ్డి

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని టీడీపీ పార్లమెం ట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సూచించారు. సోమవారం జూపాడుబంగ్లాలో పలు కమిటీలకు బాధ్యులను నియమించారు. మండల కన్వీనర్‌గా మోహన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ గా తరిగోపుల చాంద్‌బాషాను నియమించారు. ఈ సందర్భంగా నం ద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నం దికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యను వారు మర్యాదపూర్వ కంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి గిరీశ్వర్‌రెడ్డి, తరిగోపుల రాఘవేంద్ర పాల్గొన్నారు.

'పారిశుధ్య కార్మికులను తొలగించరాదు'

నంద్యాల హస్పిటల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో 50ఏళ్లు దాటిన పారిశుధ్య కార్మికులను తొలగిస్తామని బెదిరించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెన్నబాలవెంకట్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు చిన్నమ్మ, రాజమ్మ, వెంకటేశ్వరమ్మ, సులోచన, సునీత పాల్గొన్నారు.

దుకాణాల లైసెన్సులు రద్దు చేయాలి

● ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

నందికొట్కూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు అమ్మిన దుకాణాల లైసెన్సులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో రైతులు వేసిన మొక్కజొన్న పంటలను సీపీఎం నాయకులు, రైతు సంఘం నా యకులతో కలిసి ఆయన పరిశీలించారు. రైతులకు న్యాయం జరిగే వరకు రైతుల పక్షాన అండగా ఉంటామని ఆయన హామీ ఇ చ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు, రైతు సంఘం కార్యదర్శి శెట్టి రవి ప్రసాద్, చిన్నపు ల్లారెడ్డి, రవిరెడ్డి, మాబాషా, సీపీఎం ప్రజాసంఘాల నాయకులు పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, ఉస్మాన్‌బాషా పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

నంద్యాల నూనెపల్లి : జిల్లాలోని నందికొట్కూరు, జూపాడు బంగ్లా మండలాల్లో నకిలీ మొక్కజొన్న విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేలు చెల్లించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్‌రెడ్డి కోరారు. సోమవారం కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం సమర్పించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రాజశేఖర్, సహాయ కార్యదర్శులు రామచంద్రుడు, వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ఎంపీ శబరి కృషి


సీడీని ఆవిష్కరిస్తున్న బైరెడ్డి

నందికొట్కూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి ఎంపీ శబరి కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని తన నివాసంలో బైరెడ్డి కుటుంబంపై పగడం చిన్న శేషన్న రాసిన పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా బైరెడ్డి మాట్లాడుతూ ఓ సామాన్య వ్యక్తి తమ కుటుంబంపై పాట రాసి విడుదల చేయడం అభినందనీయమన్నారు. కౌన్సిలర్ చాంద్‌బాషా, టీడీపీ నాయకులు బిచ్చన్న, మురళీమోహన్‌రెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సరస్వతీమాతగా అమ్మవారు

● వైభవంగా దేవీ నవరాత్రోత్సవాలు ● భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన భక్తులు


నంద్యాల కల్చరల్ : కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయంలో సరస్వతీదేవీగా..


నంద్యాల కల్చరల్ : నిమిషాంబ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వామనాశ్రమస్వామిజీ


నంద్యాల కల్చరల్ : జగజ్జననీ దేవాలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు


నంద్యాల కల్చరల్ : బాలాజికాంప్లెక్స్‌లో సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు

దసరా ఉత్సవాలలో భాగంగా అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. పలు ఆలయాల్లో అమ్మవారు సర్వస్వతీ మాత రూపంలో అలంకరించగా, మరికొన్ని చోట్ల వివిధ రూపాల్లో దర్శనమించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



ఆత్మకూరు: సరస్వతీ మాత అలంకరణలో అమ్మవార్లు


పగిడ్యాల: నెహ్రూనగర్‌లో..


వెలుగోడులో..


గడివేములలో..


కొత్తపల్లి: ప్రత్యేక అలంకరణలో కొలనుభారతి సరస్వతీ అమ్మవారు


పాములపాడులో


పాణ్యంలో ..


నందికొట్కూరులో..

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాల నియంత్రణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన డ్రగ్స్ వద్దు బ్రో.. అనే కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాను మత్తు పదార్థాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాల న్నారు. అనంతరం ఏఎస్పీ మంద జావాలి అల్ఫోన్స్ మాట్లాడుతూ 2025లో ఇప్పటి వరకు 11 కేసులు నమోదు అవ్వడంతో పాటు సుమారు 17 కిలోలు డ్రగ్స్ సీజ్ చేశామన్నారు. మత్తు పదార్థాల నివారణ కోసం 1972 టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా ఔషధ దుకాణాలు ప్రిస్క్రిప్షన్ లేకుండా పెయిన్ కిల్లర్స్ విక్రయించకుండా చూడాలని కలెక్టర్‌కు నివేదించారు. అనంతరం మత్తు పదార్థాల నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్స్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, ఆయా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్‌లకు గౌరవ వేతనమివ్వాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇమామ్‌లకు, మౌజన్‌లకు గౌరవ వేతనమివ్వాలని కోడుమూరు ముస్లిం మైనారిటీ నాయకులు కోరారు. సోమవారం కేడీసీసీ ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. కోడు మూరు మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ ఎల్లప్ప నాయుడు, నాయకులు గంగాధర్ నాయుడు, రాజు, దావుద్ బాషా పాల్గొన్నారు.

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

నంద్యాల రూరల్ : పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యుల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ హామీ ఇచ్చారు. నంద్యాల పెన్షనర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులు సోమవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్నికైన కార్యవర్గ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, సహాధ్యక్షుడు గఫార్, కోశాధికారి ఖాసీంవలి, ఉపాధ్యక్షులు డేవిడ్, పద్మనాభం పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మాండ్ర

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుసేవాకేంద్రం, గ్రామ ఆరోగ్యకేంద్రం భవనాలను సోమవారం టీడీపీ నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో మంచినీటి పైప్‌లైన్‌కు భూమిపూజ నిర్వహించారు. అలాగే గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సీతారామాలయానికి మాండ్ర శివానందరెడ్డి దంపతులు, ఎమ్మెల్యే జయసూర్యలు భూమి పూజ నిర్వహించారు. గ్రామ సచివాలయంవద్ద స్మార్ట్ రేషన్ కార్డులను తహసీల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ గిరీష్, పీఆర్‌డీఈ శ్రీనివాసరెడ్డి, ఏవో షేక్షావలి, అల్లూరు సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్య, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ప్రసాదరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథరెడ్డి, నాయకులు వెంకటేశ్వర్లు, చల్లాదామోదరెడ్డి, మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి, ఖాతా రమేష్‌రెడ్డి, ఖలీలులాబేగ్, పలుచాని మహేశ్వరెడ్డి, రవీంద్రనాయుడు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ

మిడుతూరు: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో క్యూఆర్ కోడ్ ఆధారిత కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో దశరథరామయ్య, డిప్యూటీ ఎంపీడీవో సంజన్న, సర్పంచు జయలక్ష్మమ్మ టీడీపీ మండల కన్వీనర్లు కాతా రమేష్ రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, పలుచాని మహేశ్వర రెడ్డి, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ సుధాకర్, వివిధ గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గుండెను కాపాడుకోవాలి

● ఎస్పీ సునీల్ షెరాన్ ● ప్రజా అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల హస్పిటల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గుండెను కాపాడుకోవాలని ఎస్పీ సునీల్ షెరాన్ సూచించారు. సోమవారం నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో గుండె రక్షణ కోసం నడక ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్పీ సునీల్ షెరాన్ హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ మితాహారం, తగినంత వ్యాయామం చేయాలని, దురలవాట్లకు దూరంగా ఉంటే గుండెను పదిలంగా రక్షించుకోవచ్చాన్నారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మధుసూదన రావు మాట్లాడుతూ ప్రజల అవగాహన కోసం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ జావలి ఆల్ఫోన్స్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు సుధాకర్‌రెడ్డి, అస్రార్ బాషా, వైద్యులు సహదేవుడు, హరినాథ్‌రెడ్డి, విజయబాబు పాల్గొన్నారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

● వైసీపీ కౌన్సిలర్లు, కమిషనర్ మధ్య వాగ్వాదం


కమిషనర్‌తో వాగ్వాదం చేస్తున్న వైసీపీ కౌన్సిలర్లు

నంద్యాల టౌన్ సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ సాధారణ సమావేశం సోమవారం రసాభాసగా మారింది. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ భవనంలో ఛైర్‌పర్సన్ మాబున్నీసా అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఏజెండాను చదువుతుండగానే వైసీపీ కౌన్సిలర్లు ఇటీవల జరిగిన గేటు వేలంలో తమను అవమానించారన్నారు. దాంతో కమిషనర్‌కు, కౌన్సిలర్లకు మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. దాంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ మాబువలి మాట్లాడుతూ.. ఇటువంటి సమస్యల వల్ల ప్రజా సమయంతో పాటు ప్రజాధనం వృథా కాకుండా పట్టణం అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. సమావేశాన్ని సజావుగా సాగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. తాను నిబంధనల ప్రకారమే అన్ని చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం కోరం లేనందున సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఛైర్‌పర్సన్ ప్రకటించారు. సమావేశంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి

పగిడ్యాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు అంకితభావంతో పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం అన్నారు. ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ పదవివిరమణ పొందిన కానిస్టేబుల్ స్వర్ణ జామవాను సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాలు, ఏఎస్ఐ శేషయ్య , సిబ్బంది ఉన్నారు.

మహిళ అదృశ్యం

కొత్తపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రామ్ నాయక్ తెలిపారు.

మహానందిలో దేవదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ పూజలు

మహానంది, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో దేవదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ దంపతులు సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ ముఖమంటపం వద్ద ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు సన్మానించి ఆశీర్వదించారు. అధికారులు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పర్యవేక్షకుడు నీలకంఠరాజు, పసుపుల సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య పాల్గొన్నారు.

మహానంది క్షేత్రంలో అక్షరాభ్యాసం

మహానంది, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో సరస్వతీ అమ్మవారి జన్మనక్షత్రం మూల నక్షత్రం పురస్కరించుకొని చిన్నారులకు ఆలయ వేదపండి తుడు రవిశంకర్ అవధాని అక్షరాభ్యాసం చెయ్యించారు. సోమవారం కామేశ్వరీదేవి ఆలయం ప్రాంగణంలోని చిన్నారుల చేత అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు

పాణ్యం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం జీఎస్టీపై కమర్షియల్ ట్యాక్స్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. నంద్యాల జిల్లా నోడల్ అధికారి, డిప్యూటీ కమిషనర్ మురళీ మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మానాయక్, చందన హర్ష జీఎస్టీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లవి, ఉపసర్పంచ్ చంద్రశేఖర్‌రె డ్డి, పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై పొదుపు ఐక్య సంఘం భవనంలో పొదుపు మహిళలకు ఏపీఎం తిరుపాల్‌రెడ్డి అవగాహన కల్పించారు. సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

భూ రీ సర్వేకు రైతులు సహకరించాలి

మహానంది, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపట్టిన భూ రీ సర్వేకు రైతులు సహకరించాలని కేసీ కెనాల్ ప్రాజెక్ట్ అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డి కోరారు. సోమవారం బుక్కాపురం కోదండ రామాలయం ఆవరణలో తహసీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో భూ రీసర్వేపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ, డిప్యూటీ తహసీల్దార్ కామేశ్వరరెడ్డి, నాయకులు నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి, మారెడ్డి జయరాం, వేమూరి కేశవరావు, నాగరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు మంజూరు చేయాలి

నందికొట్కూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతులకు పప్పు శనగ, మినుము విత్తనాలను 50 శాతం సబ్సిడీతో అందించాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం నందికొట్కూరు వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయం ముందు సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు ఆందోళన చేశారు. అనంతరం వినతిప త్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు ఏసన్న, దాసు, సుధాకర్, శ్రీరాములు, సోమన్న పాల్గొన్నారు.

'హామీలు అమలు చేస్తున్న సీఎం'

గడివేముల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని అన్నారు. టీడీపీ బీసీ సెల్ పాణ్యం నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణయాదవ్ అన్నారు. మెగా డీఎస్సీలో ఎస్ఏ తెలుగు విభాగంలో 2వ ర్యాంకు సాధించిన మధుసూదన్ ను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో దుర్వేసి వైస్ ప్రెసిడెంట్ రామ కృష్ణారెడ్డి, గడిగరేవుల నీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, చిన్నదస్తగిరి, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా విజయవంతం



మాట్లాడుతున్న జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి

ఆత్మకూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా విజయవంతం అయింది. సంస్థ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మెగా జాబ్ మేళాకు 14 ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. 524 మంది అభ్యర్థులకు గాను 274 మంది వివిధ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలకు అర్హత సాధించినట్లు తెలిపారు. టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు రవీంద్రబాబు, వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ నజీర్‌అహ్మద్, నాయకులు షాబుద్దీన్, కలీముల్లా, నాగూర్‌ఖాన్, కళాశాల డైరెక్టర్ సాయిప్రణీత్ పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

జాతీయ రహదారి పనులకు మోక్షం

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 544డి జాతీయ రహదారి పను లకు మోక్షం లభించనుంది. సోమవారం నేషనల్ హైవే జేఈ సుశాంత్, కన్సల్టెన్సీ భరత్‌లు కొలిమిగుండ్ల మండలంలోని అనంత పూరం జిల్లా సరిహద్దు ప్రాంతం వద్ద బుగ్గ నుంచి గిద్దలూరు వరకు రోడ్డు అలైన్‌మెంట్ మ్యాపును పరిశీలించారు. ఈజాతీయ రహదారికి సంబంధించి మొదటి ప్యాకేజీ కింద ఇప్పటికే అనంతపురం నుంచి నంద్యాల జిల్లా సరిహద్దు వరకు పనులు 70శాతం వరకు పూర్తయ్యాయి. ఇక బుగ్గ నుంచి ప్రకాశం జిల్లా గిద్దలూరు వరకు 135 కిలో మీటర్ల పనులకు అధికారులు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈసందర్భంగా ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హైవే అధికారులను కలిసి కొన్ని విజ్ఞప్తులు చేశారు.

ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నందవరం ఆలయాభివృద్ధికి దాతలు సోమవారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ. కుమార్‌రెడ్డి చేతుల మీదుగా రూ.60వేలు విరాళం అందించారు. నంద వరానికి చెందిన రేగు బాలకుళ్ళాయి, వెంకటలక్ష్మమ్మ విరాళం అందించారు.

● మండలంలోని యాగంటి ఆలయాభివృద్ధికి సోమవారం యాగంటిపల్లెకు చెందిన తలారి మనోహర్, సుజాత దంపతులు ఆలయానికి 29,200 విరాళం ఆలయ సిబ్బంది రమేశ్, పూజారులకు అందించారు. వర్షం కారణంగా ఉమా మహేశ్వరస్వామి పల్లకీసేవ రద్దు చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వైద్యులు డిమాండ్ చేశారు. సోమవారం కొలిమిగుండ్ల ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్లు హరిచరణ్‌రెడ్డి, నాగజ్యోతి నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పీజీలో ప్రవేశాల్లో రూరల్ వైద్యులకు 30శాతం సీట్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.



డోన్, బేతంచెర్ల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, ముత్యాలపాడులో సరస్వతీదేవిగా అమ్మవారు

సరస్వతీ మాతగా అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం డోన్, ఆళ్ల గడ్డ, బనగానపల్లె నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

● ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



కోవెలకుంట్ల, రుద్రవరం, బెలుం, దొర్నిపాడు, ప్యాపిలి, సంజామల, ఉయ్యాలవాడలో సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు



మద్దిలేటి స్వామి క్షేత్రంలో..

ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించండి

సంజామల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు, మండల స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఎంపీపీ పోచా రమాదేవి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సాల్మన్ అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయా శాఖలు సాధించిన ప్రగతిని సభకు వివరించారు. ముదిగేడు మండల పరిషత్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి రైతుల యూరియా కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వ్యవసాయాధికారి జ్యోతి మాట్లాడుతూ త్వరలో మరింత యూరియాను సరఫరా చేసి రైతులకు కొరత లేకుండా చూస్తామన్నారు. ముక్కమళ్లలో నీటి సమస్య అధికంగా ఉందని ఎంపీపీ తెలిపారు. కౌలు రైతులపై భూస్వాములు అపోహలు కల్గి ఉన్నారని వారికి అవగాహన కల్పించాలని తహసీల్దారు అనిల్‌కుమార్ కోరారు. సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం ముగిసింది. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఏవో రామసుబ్బయ్య, డాక్టర్ కృష్ణకుమారి, ఏడీ కొండారెడ్డి, వెలుగు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో రవిప్రకాశ్, ఏఈలు హరీశ్, రషీద్, వెలుగు ఏపీఎం గురుస్వామి, సూపర్‌వైజర్ శాంత తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

అవుకు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లశిం గవరం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బనగానపల్లె: కూటమి ప్రభుత్వం సంస్కరణలో భాగమే స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ అని టీడీపీ మండల అధ్యక్షుడు పీవీ. కుమా ర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డిలు అన్నారు. సోమవారం పలు గ్రామాల్లో వీఆర్‌వోలు, టీడీపీ నాయకులు రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు.

బేతంచెర్ల: రేషన్ వినియోగదారులు స్మార్ట్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి అన్నారు. సోమవారం పట్టణంలోని రైల్వేగేటులో సమీపంలో ఉన్న 4వ గ్రామ సచివాలయాల్లో కార్డుదా రులకు స్మార్ట్ కార్డులను బుగ్గన ప్రసన్నలక్ష్మి గ్రామ సచివా లయ సిబ్బంది పంపిణీ చేశారు. డీలర్లు శ్యాం, కార్డు వినియోగదారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

చాగలమర్రి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో తాహిర్‌హుసేన్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని చింతలచెరువు గ్రామంలోని సచివాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఉద్యోగులు సమయ పాలన పాటించాలన్నారు. ఎంపీడీవో వెంట కార్యదర్శి వెంకటేశ్వర్లు, సచివా లయ ఉద్యోగులు ఉన్నారు.

వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలి

డోన్ రూరల్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలని నంద్యాల జిల్లా ఒకేషనల్ కో-ఆర్డినేటర్ సుధీర్‌బాబు, యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. సోమవారం పాతపేట ఉన్నత పాఠశాలలో వృత్తి విద్యను అభ్యర్థిస్తున్న పదో తరగతి విద్యార్థులకు దసరా సెలవుల సందర్భంగా సమగ్ర శిక్ష స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్, ఐటీఐ రం గాల్లో పది రోజులు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

బలిజ సంఘం నాయకుల నిరసన ర్యాలీ

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలో గిరి బలిజగా పేరు మారుస్తూ జీఓ జారీ చేయడాన్ని నిరసిస్తూ తాలుకా బలిజ సంఘం నాయకులు సోమవారం ర్యాలీ నిర్వహిం చారు. తాలుకా అధ్యక్షుడు నల్లగట్ల బాలుడు మాట్లాడూతూ గిరి బలిజ అని తమకులం పేరును వాడుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈజీవో ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ జ్యోతి రత్నకుమారికి వినతి పత్రాన్ని అం దజేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రుద్రవరం: రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన గిరి బలిజ జీవోను రద్దు చేయాలని బలిజ సంఘం నాయకులు పోలా గురుమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం రుద్రవరంలో ర్యాలీ చేసి తహసీల్దారు ఆల్‌ఫ్రెడ్‌కు వినతిపత్రం అందించారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

డోన్ టౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): డోన్ మున్సిపాలిటీలో ఉద్యోగులుగా పని చేస్తూ మృతి చెందిన కుటుంబాల పిల్లలకు కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు కల్పించామని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తెలిపారు. సోమవారం కమిషనర్ ప్రసాద్‌గౌడు ఆధ్వర్యంలో వారికి నియామక పత్రాలను అందజేశారు. అలాగే సీఎం సహాయనిధి కింద చెక్కులను ఎమ్మెల్యే కోట్ల బాధితులకు అందజేశారు.

● పట్టణంలోని రేణుకా ఎల్ల మాంబేశ్వరదేవి దేవాలయంలో దుర్గాష్టమి వేడుకలకు హాజరు కావాలని ఆలయ నిర్వాహకులు ఏఈ నాగరాజు గౌడు, సీనియర్ న్యాయవాది ఆలా మోహన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఎల్లగౌడుతో కలిసి ఎమ్మెల్యే కోట్లకు ఆహ్వానపత్రిక అందజేసి ఆహ్వానించారు.

● జాతీయ స్థాయిలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐకార్) నిర్వహించిన పీజీ (ఏఐఈఈఏ) పరీక్షలో డోన్‌కు చెందిన షర్మిల ప్రతిభ కనబరిచి 42వ ర్యాంకు సాధించింది. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యార్థిని షర్మిళను ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అభినందించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏఈ నాగరాజు పాల్గొన్నారు.



కారుణ్య నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

● ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదితమ్మ జన్మదిన వేడుకలను పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో టీడీపీ నాయకులు ఓంప్రకాష్, పీఏసీఐ చైర్మన్ ఎల్లగౌడు, సీమ సుధాకర్ రెడ్డి, కోట్ల రవీంద్ర, అజీజ్, జావీద్, మధు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ ఎల్లగౌడు, ఓం ప్రకాష్, అడ్వకేట్ ఆలా మోహన్ రెడ్డి, రవీంద్ర, మధు, అజీజ్, సుధాకర్ రెడ్డి, రఘు పాల్గొన్నారు.

దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మోదీ

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన వ్యక్తి ప్రధాని నరేంద్రమోదీ మాత్రమేనని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు అన్నారు. సోమవారం కొలిమిగుండ్లలో బీజేపీ అధ్యక్షులు రామసుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, ఉపాధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్ ప్రారంభించి, రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిద్దమోని యాదయ్య, రామకృష్ణ, చంద్రశేఖర్, రామ్మోహన్ పాల్గొన్నారు.